# ఆదర్శప్రాయుడైన యోసేపు

## 1. వడ్రంగి వాడైన యేసేపు

"ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లిపేరు మరియ కాదా? యాకోబు యోసేపు సీమోను యూదాయనువారు ఇతని సోదరులు కారా?" (మత్తయి 13:55); వృత్తి పరంగా యేసేపు వడ్రంగి పని చేసేటి వ్యక్తి. దేవుని ప్రణాళిక బహు గొప్పది, దీనులను పైకి లేవనెత్తే దేవుడు మన దేవుడు. పుట్టబోయే యేసుకి చట్టప్రకరముగా తండ్రి కావాలి. కావాలంటే రాజులను, ప్రధానులను, గొప్పవారి ఇంట్లో జన్మించివచ్చు కాని వడ్రంగి పని చేసే మంచిమనసున్న యేసేపుని దేవుడు ఎన్నుకున్నాడు. (మార్కు 6:3)

## 2. ఆర్ధికంగా బీదవాడైన యేసేపు

అవును బీదవాడైన యేసేపుని మరియ ప్రధానం చేసుకుంది. "ఆమె గొర్రె పిల్లను తేజాలని యెడల ఆమె రెండు తెల్ల గువ్వలనైనను రెండు పావురపు పిల్లలనైనను దహనబలిగా ఒకదానిని, పాపపరిహారార్థబలిగా ఒక దానిని తీసికొని రావలెను. యాజకుడు ఆమె నిమిత్తము ప్రాయశ్చిత్తము చేయగా ఆమెకు పవిత్రత కలుగును." (లేవి 12:8) మోషే ధర్మశాస్త్రము ప్రకారం ప్రతి తొలిచూలి మగబిడ్డను మందిరానికి తీసుకొని రావాలి, ఆర్ధికంగా ఉన్నవారు గొర్రెలను, బీదవారు అయితే రెండు గువ్వలను, పావురాలను బలికి తీసుకొనిరావాలి. "ప్రభువు ధర్మశాస్త్రమందు చెప్పబడినట్టు గువ్వల జతనైనను రెండు పావురపు పిల్లలనైనను బలిగా సమర్పించుటకును, వారు ఆయనను యెరూషలేమునకు తీసికొనిపోయిరి." (లూక 2:24)

## 3. న్యాయవంతుడైన యోసేపు

"ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడైయుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను." మత్తయి 1:19 “న్యాయవంతుడు"- ఇలా అనువదించిన గ్రీకు పదానికి అర్థం ఇతరుల పట్ల న్యాయంగా నిష్పక్షపాతంగా ప్రవర్తించేవాడు; దేవుని పట్ల, దేవుని వాక్కు విషయంలో యథార్థంగా భక్తిభావంతో ఉండేవాడు. మరియ వ్యభిచారం విషయంలో దోషి అని ఆమెతో తెగతెంపులు చేసుకోవాలని యోసేపు తప్పుగా భావించాడు. అయితే అతడు మంచివాడు, మరియను ఎంతో ప్రేమించి ఉంటాడు కాబట్టి ఆమె పట్ల దయగా వ్యవహరించాలని అనుకున్నాడు. మరియ సంగతి చూస్తే దేవుని సంకల్పం ప్రకారం చేసేవాళ్ళను మనుషులు అపార్థం చేసుకుని లేనిపోని నేరాలు మోపి, ప్రమాదాలకు గురిచేసే అవకాశం ఉందని అర్థం చేసుకోవచ్చు. ఇస్రాయేల్వారి చట్టం ప్రకారం వ్యభిచారానికి శిక్ష మరణం (ద్వితీ 22:23-24).

## 4. విధేయుడైన యేసేపు

యాసేపు నిద్రమేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారముచేసి, తన భార్యను చేర్చుకొని ( మత్తయి 1:24). అప్పటివరకు మరియను ఎలా వదిలించుకోవాలి అని ఆలోచించిన యేసేపు, ఎప్పుడైతే దేవదూత చెప్పినదో వెంటనే ఆ మాటకు విధేయత చూపడం మనం ఇక్కడ చూస్తాం. అక్కడ యేసేపు విధేయత చూపడం వలనే యేసేపు వంశావలిలో యేసు పుట్టడం చూస్తాం. మరి నీవు దేవుని మాటకు విధేయత చూపిస్తావా?

## 5. సంరక్షకుడైన యేసేపు

"అప్పుడతడు లేచి, రాత్రివేళ శిశువును తల్లిని తోడుకొని, " ( మత్తయి 2:14) బీదవాడైన వడ్రంగి పనివాడు కాని యేసు కోసం అన్ని వదిలేసి దేవదూత ఎలా చెప్తే అలా చేయడం మనం ఇక్కడ చూస్తాం. దూత చెప్పిన వెంటనే రాత్రి పూట ఆయిన లేచి తల్లిబిడ్డ ని తీసుకొని ఐగుప్తులోనికి వెళ్లడం చూస్తాం. ఎంత మంది దేవుని పిలుపుకు లోబడుతున్నారు? దేవుడు పరిచర్యకిపిలిస్తే ఈ రోజులలో అక్కడ కరెంట్ ఉందా? Cellphone సిగ్నెల్ ఉంటాయా? రోడ్లు బాగుంటాయా? మంచి వాహనం ఉందా? ఇలా లెక్కలు వేసుకుంటున్న సేవకులు ఎంతమంది లేరు? యేసేపు అలా కాదు వెంటనే లేచి, రాత్రి పూట తల్లిబిడ్డ తో ప్రయణమావడం చూస్తాం. నీవు అలా సిద్ధబాటు కలుగి ఉన్నావా?

## 6. వాక్యానుసారుడైన యేసేపు

"మోషే ధర్మశాస్త్రముచొప్పున వారు తమ్మును శుద్ధి చేసికొను దినములు గడచినప్పుడు " (లూక 2:22) దేవుని వాక్యము ఎలా చెపితే అలా నడుచుకుంటున్నాడు మన యేసేపు. తన కొడుకైన యేసుని తీసుకొని, మరియను శుద్ధి చేసుకొను దినములు వచ్చినపుడు మందిరమునకు తీసుకొని రావడం చూస్తాం. దేవుని మాటకు యేసేపు విధేయుడవడం మాత్రమే కాదు, తన కుటుంబం కూడా అలా ఉండేలా చేస్తున్నాడు. (లూక 2:48)

## 7. యేసుకు చట్టబద్ధ తండ్రి అయిన యేసేపు

యేసు (బోధింప) మొదలుపెట్టినప్పుడు ఆయన దాదాపు ముప్పది ఏండ్ల యీడుగలవాడు; ఆయన యోసేపు కుమారుడని యెంచబడెను. (లూక 3:23) అనేక దేశాల పురాణ గాథల్లోలాగా ఇది దేవునికీ ఒక మానవ స్త్రీకి వివాహం జరగడం కాదు. దేవుని అదృశ్య పవిత్రాత్మ ఆమె గర్భంలో ఆ కుమారుని శరీరాన్ని, మానవ స్వభావాన్ని సృష్టించాడు. యోసేపు యేసుకు చట్టబద్ధమైన తండ్రిగా చూస్తాం. పరిశుద్ధాత్మ ద్వార పుట్టిన, యేసుకి తండ్రి అవ్వడం నిజముగా యేసేపు వంశానికే పేరు రావడం చూస్తాం. ఆయన తల్లి కుమారుడా, ఇదిగో నీ తండ్రియు నేనును దుఃఖపడుచు నిన్ను వెదకుచుంటిమని అయనతో చెప్పగా (లూక 2:48). నీ తండ్రి అనడంలో మరియ ఉద్దేశం యేసుకి చట్టబద్ధమైన తండ్రి యోసేపు అని, దీనిని లూక రెండవ సారి నొక్కి చెప్పడం మనం ఇక్కడ గమనించవచ్చు.

ప్రియ దేవుని బిడ్డలారా, యేసేపు మరియను చేర్చుకొని మనకు నిజముగా ఆదర్శప్రాయుడిగా నిలిచాడు. మరియకి మంచి భర్తగా, యేసుక్రీస్తు కి మంచి తండ్రిగా, ఆ కుటుంబానికి మంచి రక్షకుడిగా, న్యాయవంతునిగా, యధార్థవంతునిగా, దేవుని మాటకు లోబడే వానిగా, వాక్యానుసారుడిగా ఉండి నిజముగా మనకు ఆదర్శప్రాయుడైనాడు. ఈ క్రిస్మస్ దినాలలో మనం అందరం యేసేపు వలే ఇతరులకు ఆదర్శంగా ఉండాలి, దేవునికి లోబడాలి, వాక్యానుసారుడై ఉండాలి అని ఆశిస్తూ…